

పరారీలో రిమాండ్ ఖైదీ : గాలిస్తున్న పోలీసులు

కొండాపురం : మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రిమాండ్ ఖైదీ పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు అంతరాష్ట్ర ముఠాకు చెందిన నాగిరెడ్డి అనే ఒక ఖైదీ కర్ణాటక రాష్ట్రం ధార్వాడ పోలీస్ స్టేషన్‌లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఇతను కొండాపురం మండలంలోని ఒక చోరీ కేసులో కూడా ముద్దాయిగా ఉండడంతో గురువారం జమ్మలమడుగు కోర్టుకు హాజరు పరచారు. తిరిగి పోలీసులు ధార్వాడకు తీసుకెళ్తున్న సమయంలో కొండాపురం పోలీస్ స్టేషన్ వద్ద అదేరోజు రాత్రి 8 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఆగారు. ఆ సమయంలో కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన ఖైదీ ప్రహరీ దూకి పరారైన సంఘటన వెలుగు చూసింది. ఈ ఖైదీని పట్టుకోవడానికి పోలీసులు ఐదు టీములుగా ఏర్పడి గాలిస్తున్నారు. ఇప్పటికీ ఖైదీ ఆచూకి లభించలేదు. కాగా అతనిపై దాదాపు 200 పైగా కేసులు ఉన్నట్లు సమాచారం.

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశంలో కలెక్టర్ వి.విజయ్ రామరాజు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

వ్యవసాయ, అనుబంధ రంగాలను మరింత పటిష్టం చేసి లాభాల బాటలోకి తీసుకురావాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి.శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందివ్వాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సహకాల కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగుబడి 72941 హెక్టార్ల సాగుబడి లక్ష్యం కాగా ఇప్పటికే ముందస్తుగా 176 హెక్టార్లు సాగు బడిలోకి తీసుకొచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల నుంచి ఖరీఫ్ సాగునీటి కోసం ముందస్తుగా సాగు నీటి విడుదల కోసం ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. రైతులకు మేలు చేకూర్చాలనే ప్రధాన ఉద్దేశంతో పండించిన పంట దిగుబడులను మద్దతు ధరతో అత్యధికంగా కొనుగోలు చేయడంలో మన జిల్లా రాష్ట్రం లోనే ప్రథమంగా నిలిచిందన్నారు. పంట సాగుబడిలో విత్తనం మొదలు, దిగుబడి వరకు అన్ని దశల్లో క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ జరగాలన్నారు. అన్ని వ్యవసాయ భూముల్లో సాయిల్ టెస్టింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో రైతులు వెలిబుచ్చిన సమస్యలను అని విధాలా పరిష్కరిస్తామని తెలిపారు. జెసి గణేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో రాగి, జొన్న, కంది పంటల సాగు విస్తీర్ణాన్ని పెంపొందించాలని ఆ దిశగా వ్యవసాయ శాఖ డివిజన్ల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించాలని తెలిపారు. ప్రతి ఆర్‌బికెలలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన, వ్యవసాయాధికారులు ఆమోదించిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి ఆయా డివిజన్ల పరిధిలో చేపట్టాల్సిన అన్ని ప్రక్రియల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అగ్రికల్చర్ మార్కెటింగ్ గోడౌన్ల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కూడా త్వరలో సేకరిస్తామన్నారు.. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభివద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగుతొందన్నారు. రైతు భరోసా పథకం ద్వారా సాగు విస్తీర్ణం పెరిగిందని ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ తో, పంట నష్టం వాటిల్లిన రైతులకు సంబందిత సీజన్ ముగియకముందే వారి ఖాతల్లో నగదు జమచేయడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తోందన్నారు. ఈ సీజన్లో పశువులకు గాలికుంటు వ్యాధి అధికంగా సోకే అవకాశాలు అధికంగా ఉన్నాయని, అందుకు ముందస్తుగా నివారణా చర్యలు చేపట్టాలన్నారు. పశువులకు గొర్రెలు, మేకలు, పందులు తదితర చిన్న పెద్ద అనిమల్స్ కు సంబంధించి కొత్తగా వచ్చిన భీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గండికోట రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునే అవకాశం ఇవ్వాలని కొండాపురం నిర్వశిత గమస్తులు కోరుతున్నారని, అలాగే సింహాద్రిపురం మండల కేంద్రంలో కొత్త వెటర్నరీ ఆసుపత్రి మంజూరు చేయాలని కోరుతున్నారని బోర్డు దృష్టికి తీసుకొచ్చారు. అంతకు ముందు వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖల శాఖలు సాధించిన ప్రగతిని, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలును, ఆర్‌బికెల సేవలను సమావేశంలో వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాలలో చర్చించిన అంశాల ప్రతిపాదనలను, గత జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో బోర్డు సభ్యుల నివేదికలను పరిశీలించిన బోర్డు వాటిని ఆమోదం తెలిపారు. గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు అంశాలకు సంబ ంధించి ఆయా శాఖల అధికారులు వివరణలు అందజేశారు. అనంతరం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ వారు రూపొందించిన వైఎస్ఆర్ పశు బీమా కు సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ బోర్డు సభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహాదారులు ఇరంగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి రాజీవ్ మైఖేల్, ఆత్మపీడీ విజయకుమారి, ఎపిఎంఐపి పీడీ రవీంద్రరెడ్డి, సిఎంఎస్ఎఫ్ (ప్రకతి వ్యవసాయం) డిపిఎం రామకృష్ణ, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సహకార, సివిల్ సప్లయ్, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న

పొట్టిపాడు గ్రామస్తులు

- మా ప్రాణాలకు రక్షణ కల్పించాలని వేడుకోలు

- పోలీసుల హామీతో ఆందోళన విరమణ

ఆందోళన చేస్తున్న పొట్టిపాడు గ్రామ మహిళలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని పొట్టిపాడు గ్రామ సమీపంలో ఉన్న చిత్రావతి నదిలో శుక్రవారం ఇసుకను అక్రమంగా తీసుకెళ్తున్న ఇసుక టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక మాఫియా నుంచి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాధికారులను వేడు కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ మూడేళ్లుగా లక్షలాది టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధితాధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. టిప్పర్లు తమ గ్రామం మీదుగా వెళ్లడం వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, పైగా దుమ్ము, ధూళితో అనారోగ్యానికి గురవు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు దెబ్బతినడంతో గ్రామానికి ఆటోలు, బస్సులు రావడం లేదని పేర్కొన్నారు. చివరకు అంబులెన్సు రావడానికి కొన్ని గంటల సమయం పడుతోందని తెలిపారు. చిత్రావతి నదిలో దాదాపు 20 అడుగుల లోతు వరకు ఇసుక తీయడం వల్ల నీటి ఎద్దడి తలెత్తి తమ గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని కృష్ణమ్మ అనే మహిళ వాపోయారు. తమ గ్రామం మీదుగా పగలు, రాత్రుళ్లు ఇసుక టిప్పర్లు వెళ్లడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని, ముఖ్యంగా రాత్రుళ్లు టిప్పర్ల శబ్దానికి జాగారం చేయాల్సి వస్తోందని మరో మహిళ లక్ష్మిదేవి వాపోయారు. వెంటనే ఇసుక అక్రమ రవాణాను ఆపేయాలని విజ్ఞప్తి చేశారు. విషయం తెలుసుకున్న సిఐ చెన్నారెడ్డి, ఎస్ఐ రవికుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని టిప్పర్లు పొట్టిపాడు గ్రామం మీదుగా వెళ్లకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. గ్రామస్తుల ఆందోళనకు చింతా రాజనరసంహారెడ్డి, నవజ్యోతిరెడ్డి, పెద్దిరెడ్డి, సూర్య నారాయణ రెడ్డి, అశోక్ రెడ్డి,సుదర్శన్ రెడ్డి తిమ్మాపురం శేఖర్, శ్రీరంగనాథరెడ్డి మద్దతు ఇచ్చారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

- సిఐటియు రాష్ట్ర నాయకులు రాంభూపాల్

శిక్షణ తరగతుల ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే పరిష్కార మార్గాలని సిఐటియు రాష్ట్ర నాయకులు రాంభూపాల్ అన్నారు. శుక్రవారం జడ్‌పి కాన్ఫరెన్స్ హాలులో అంగన్‌వాడీల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా అమలు చేయలేదని విమర్శించారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా అంగన్‌వాడీ సెంటర్లను పాఠశాలలకు అనుసంధానం చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల వేతనాలు పెరగడం కాదు, ఉన్న పనికి భద్రత లేకుండా పోయిందని చెప్పారు. గౌరవవేతనం కాదు కనీస వేతనం అమలు చేస్తామని చెప్పిన వైసిపి, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని పేర్కొన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అంగన్ వాడీలను గుర్రాలతో తొక్కించి ఇప్పుడు అంగన్‌వాడీలను ఆదుకు ంటామని చెప్పడం ఎన్నికల లబ్ధికేనని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యా వ్యవస్థలను కార్పొరేట్లకు అప్పగిస్తుందని విమర్శించారు. టిడిపి, వైసిపి ఢిల్లీలో బల పరచడం, ఇక్కడ వ్యతిరేకిస్తున్నట్లు నటించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అంగన్‌వాడీలను, విద్యారంగాన్ని కాపాడుకునేది ఎలా సాధ్యమన్నారు. కార్మికులు ఐక్యంకావడం, పోరాటాలు, ఉద్యమాలు చేయడం ఒక్కటే మార్గమని చెప్పారు. సందద సృష్టించే వాడు కార్మికుడు అని గతంలో అనేవారని, ఇప్పుడు అదాని, అంబానిల పేరు బిజెపి ప్రభుత్వం చెబుతుందని విమర్శించారు. సమావేశంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర నాయకులు సుప్రజా, త్రిఫ్ట్ సొసైటీ డైరెక్టర్ చందన, సిఐటియు జిల్లా, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మిదేవి, బి.లక్ష్మిదేవి, కోశాధికారి అంజనిదేవి, ఐద్వా జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ పాల్గొన్నారు.

నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలి

ప్రజాశక్తి - కడప

ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిబద్ధతతో పనిచేసూ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి కలెక్టర్ వి.విజయ్ రామరాజు సూచించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కారుణ్య నియామకం ద్వారా రెవెన్యూ శాఖలో 9 మంది, వివిధ ప్రభుత్వ శాఖల్లో 12 మంది మొత్తం4 21 మందికి శుక్రవారం నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు పొందిన వారు ఇంట్లో పెద్దదిక్కుగా వ్యవహరిసూ ఇటు ఉద్యోగ ధర్మాన్ని, అటు ఇంటి బాధ్యతలను మరువకుండా నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం రెండేళ్ల ప్రొబేషన్ పీరియడ్ లో ఉద్యోగిగా నిర్వర్తించగలిగే విధులపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎక్కడా ఆక్రమార్జనకు పాల్పడకుండా సక్రమమైన మార్గంలో నడుస్తూ ఉద్యోగ ధర్మంలో గౌరవాన్ని పెంపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ. విజయ్ కుమార్, సెక్షన్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలకు తిలోదకాలు

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న బండి జకరయ్య

వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పభుత్వం ఎన్నికల హామీలకు తిలోదకాలు ఇచ్చి ఎడాపెడా విద్యుత్తు ఛార్జీలు పెంచుతూ ప్రజలపై పెను భారం మోపిందని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్తు ప్రయివేటీకరణ బిల్లుకు మద్దతునిచ్చి శరవేగంగా అమలు చేస్తూ విద్యుత్తు సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోంది అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు రానున్న కాలంలో కూడా విద్యుత్తు చార్జీలు పెంచబోమని నమ్మబలికి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని చెప్పారు. నాణ్యమైన విద్యుత్‌ను నిరాటంకంగా అందిస్తామని చెప్పి నేడు నిరంతర కోతలు, వాతలు వేస్తున్నారు అని మండి పడ్డారు. ఒక కోటి 89 లక్షల మందికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి రూ 13500 కోట్ల ప్రజలపై పెనుభారం మోపారనని వాపోయారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో ఎంత పడితే అంతా, వసూలు చేస్తున్నారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టిడిపి ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచడం వల్ల ఆ ప్రభుత్వాన్ని ప్రజలు మట్టికరించారు అన్నారు. సమావేశంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కదిరి ప్రసాదు గౌడ్ పాల్గొన్నారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

జిల్లాలో కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం పాఠశాల తమ సంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చేశాయని విద్యాశాఖ అధికారులకు అనేకమార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఎటువంటి చర్యలుగాని, విచారణగాని చేపట్టకపోవడం దారుణమని పిడిఎస్‌యు నాయకులు విమర్శించారు. శుక్రవారం డిఇఒ కార్యాలయం ఎదుట పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కేవలం నర్సరీకే రూ.25వేల నుంచి రూ. 35వేలు విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి అక్రమంగా డొనేషన్ రూపంలో వసూలు చేస్తున్నారని తెలిపారు. తమ పాఠశాలలో పుస్తకాలు కొనాలని హుకుం జారీ చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ అనుమతి లేకపోయినప్పటికీ ప్రయివేట్ హాస్టల్ నిర్వహిస్తూ విద్యార్థులకు నాసిరక భోజనం అందిస్తూ వేలాది రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల ఆగడాలను కట్టడి చేసి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అన్నమ్మయ్య జిల్లా పిడియస్‌యు నాయకుడు స్వరూప్ తేజ, నగర నాయకులు శ్రీనివాసులు రెడ్డి, సయోఫ్, రిహాన్, ప్రిన్స్ టోన్, పూర్ణ సాగర్, కమల్, సిద్ధిక్, బాలు, రాహుల్, సుబ్బారాయుడు, మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎస్‌పి అన్బురాజన్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రజల భద్రత, భరోసా కల్పిస్తూ విజిబుల్ పోలీసింగ్, నేరపూరిత కార్యక్రమాలు జరగకుండా కట్టడి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. వాహనాల తనిఖీలో అణువణువూ క్షుణ్ణంగా పోలీసులు పరిశీలించారు. అనుమానం వచ్చిన వారితో వివరాలు సేకరించారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

విద్యార్థులను మోసగిస్తున్న సిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి అంటూ డబ్బులు బ్యాంకుల్లో వేయకుండా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేస్తున్నారని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ విమర్శించారు. శుక్రవారం టిడిపి జిల్లా కార్యాలయంలో 'ఫీజు ఎక్కడ కంస మామ' అనే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను విద్యకు దూరం చేసేలా వైసిపి పాలన సాగుతుందని చెప్పారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భరత్‌కుమార్, మీడియా కో-ఆర్డినేటర్ విశ్వనాధ్, నగర అధ్యక్షులు అనిల్, ప్రధాన కార్యదర్శి అరుణ్, ఉపాధ్యక్షులు అబ్దుల్ ఖలీద్, కార్యదర్శులు మల్లేష్, రెడ్డి, బాబు, నాయకులు ఆనంద్, శ్రీకాంత్ సాయి, షేక్.యూనిస్, షేక్.సుబహాన్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సిడిపిఒను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి -కడప అర్బన్

సిడిపిఒను తక్షణమే సస్పెండ్ చేయాలని అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు బి. మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప నగరంలో పనిచేస్తున్న అంగన్వాడీ టీచర్లను, ఆయాలను మానసికంగా వేధిస్తూ, ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరితే తనకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. విధులకు సరైన సమయానికి రాకుండా, అడిగిన వారిని కక్షపూరితంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలిపారు. సంవత్సరాల తరబడి టిఎ బిల్లులు పెండింగ్ ఉన్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. నెల నెల పోపు సామాన్ బిల్లులు రావడం లేదని తెలిపారు. బాడుగలు నెలలు గడిచినా రావడం లేదని పేర్కొన్నారు. పోప్ సామాన్ల బిల్లులు రావడానికి వేల రూపాయలు వసూలు చేస్తున్న మాట వాస్తవమన్నారు. అర్హులైన ఆయాలకు ప్రమోషన్లు ఇవ్వాల్సి ఉండగా కడప సిడిపిఒ కార్యాలయంలో డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే ఇస్తున్నారని, లేనివారికి ఎన్ని నెలలు, సంవత్సరాలు పడుతుందో అర్థం కాదని పేర్కొన్నారు. వారికి నెలలు గడిచినా ఫైలు కదిలే పరిస్థితి లేదని తెలిపారు. వీటన్నిటి పైన అడిగితే కక్షపూరితంగా మెమోలిచ్చి ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నారని పేర్కొన్నారు. కడప సిడిపిఒను తక్షణమే సస్పెండ్ చేయాలని, లేకపోతే ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు.

'కెఎస్ఆర్ఎం'లో గ్లోబల్ బ్యూటీ ఎంపికలు

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్లోబల్ బ్యూటీ ట్రెసర్, గ్లోబల్ బ్యూటీ హండ్సమ్, కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గ్లోబల్ బ్యూటీ ఎంపికలు కళాశాల సమావేశం మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ బ్యూటీ ట్రెజర్, గ్లోబల్ హ్యాండ్సం ట్రెజర్, ముఖ్య నిర్వాహకురాలు సుహాసిని పాండ్యా మాట్లాడుతూ 14-17 , 18-30 వయస్సు గల వారికి పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ ఎంపికలలో వివిధ ప్రాంతాల నుంచి 30 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఇందులో 10 మంది ఎంపిక అయ్యారని, వీరికి ఆగస్టులో మెరిడియన్ హోటల్ హైదరాబాద్ లో గ్రాండ్ ఫైనల్ ఎంపికలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి ప్రేమ్ కుమార్, గ్లోబల్ బ్యూటీ ట్రెజర్ గ్లోబల్ హ్యాండ్సమె ట్రెజర్ జనరల్ మేనేజర్ సరస్వతి, సిబ్బంది, కళాశాల కల్చరల్ కమిటీ సమన్వయకర్త వీర శంకర్ పాల్గొన్నారు.

గ్లోబల్ బ్యూటీ ఎంపికల్లో అమ్మాయిలు, అబ్బాయిలు

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

ప్రజాశక్తి - కడప

ఆపదలో ఉన్న వారికి యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎపి ఎన్ఆర్‌టి ఎస్ డైరెక్టర్ బి. హెచ్. ఇలియాస్ పిలుపునిచ్చారు. రక్తదానం చేయండి ప్రాణ దాతలు కండి అని కరపత్రాలను పంచుతూ సేవలందిస్తున్న కరీముల్లాను శుక్రవారం కడపలోని తన కార్యాలయంలో ఎపి ఎన్ఆర్‌టిఎస్ ఆధ్వర్యంలో అభినందించి సన్మానించారు. మాట్లాడుతూ రక్తదాన ప్రచారకుడు రాయల్ కరిముల్లా మూడు సంవత్సరాల నుండి కడప నగరంలో తన వంతుగా రక్తదాన కరపత్రాలు పంచుతూ సేవలు అందించడం అభినందనీయమని తెలిపారు. రాబోవు రోజులలోనూ రక్తదాన ప్రసార కార్యక్రమం నిరంతరం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు అన్సర్, బాబు భాయ్, దర్బార్ పాల్గొన్నారు.

గర్భిణికి రక్తదానం

ప్రజాశక్తి- పోరుమామిళ్ల టౌన్

మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన రత్న కుమారి అనే గర్భిణి కాన్పు కోసం శుక్రవారం ప్రయివేట్ ఆస్పత్రిలో చేరగా వైద్య సిబ్బంది ఓ పాజిటివ్ రక్తం అవసరం అని చెప్పారు. ఆమె బంధువులు రైట్ హ్యాండ్ ఆర్గనైజేషన్ ఆశ్రయించారు. ఆర్గనైజేషన్ ఫౌండర్ రసూల్ వరికుంట్ల గ్రామానికి చెందిన వరికుంట్ల రాజశేఖర్ చేత రక్తదానం చేయించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని సమయానికి స్పందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, రక్తదానం చేయాలనుకునేవారు 8125991900 కు రక్తదానం వాట్సప్ చేయాలని అన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో వన్ టౌన్ సర్కిల్ దగ్గర వెలసివున్న హజరత్ ఖాజా సయ్యద్ షా మొహమ్మద్ షహబుద్దీన్ (మోహర్ అలీ షా) దర్గా ఉరుసు ఉత్సవాల కార్యక్రమాన్ని ఆ దర్గా పీఠాధిపతి (గద్దీ నషీన్) హజరత్ సయ్యద్ షా మొహమ్మద్ జమాలుల్లా బాషా హుసేని సాహెబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గాలో పూల చాందిని సమర్పించి, ఫాతెహా చేసి ప్రార్థనలను నిర్వహించాం నాతియ మెహిఫీల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

18న విద్యుత్ సదస్సు

ప్రజాశక్తి - కడప అర్బన్

'విద్యుత్ సంస్కరణలు-భారాలు- తక్షణ కర్తవ్యం'అంశంపై ఈ నెల 18న సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కమిటీ సభ్యులు డి.ఎం.ఓబులేసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిపిఎం కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజానీకం సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు.

ఓటర్ల సవరణ జాబితా సిద్ధం

ప్రజాశక్తి - కడప

ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా- 2024ను ఎలాంటి పెండింగ్ లేకుండా సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. శుక్రవారం రాజధాని అమరావతి నుంచి వీడియో కాన్ఫెరెన్సు ద్వారా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా పురోగతిపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, జెసి కమిషనర్ విసి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికీ వరకు నూతనంగా 12480 మంది యువ ఓటర్లు 256 మంది ట్రాన్స్ జెండర్లు ఎన్‌రోల్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. జిల్లాలో డుప్లికెట్ ఓటర్లు, ఇతర ప్రదేశాలకు వలస పోయిన వారు, మరణించిన వారు, కొత్తగా వివాహం అయ్యి వేరే ఊళ్లకు వెళ్లిన వారు, పునరావృతం అయిన పేర్లు వంటి తొలగింపుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఫారమ్ 6 ఫారమ్-7, ఫారమ్-8 పెండిన్సెలు, గ్రీవెన్స్‌ల పరిష్కారాల పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ కు వివరించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు జిల్లాలో అన్ని పనులను పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18-19 వయస్సులో ఉన్న వారు, ట్రాన్స్ జెండర్లు, నిరాశ్రయుల జాబితాను తయారీలోను ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఉర్దూ పాఠ్య పుస్తకాలు సరఫరా చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పాఠశాలలు పు:న ప్రారంభమైన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని విద్యాశాఖ ఆదేశించినా ఉర్దూ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల సరఫరాలో జాప్యం ఎందుకని ఐటా రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నజీర్‌బాష, అబ్బాస్ అలీ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు మాధ్యమ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ వెంటనే స్పందించి పాఠ్యపుస్తకాలు సరఫరా చేయాలని పేర్కొన్నారు.

సురక్షితంగా ఇండియాకు చేరిన మహిళ

ప్రజాశక్తి - కడప

కువైట్‌లో కష్టాలు పడుతున్న ఊరి పద్మావతి అనే మహిళ సురక్షితంగా ఇండియాకు చేరుకున్నారు. ఇందుకు సహకరించి మహమ్మద్ యూనిస్‌ను ఎపి ఎన్ఆర్‌టిఎస్ డైరెక్టర్ బిహెచ్. ఇలియాస్, కువైట్ వైసిపి కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, రీజనల్ కో- ఆర్డినేటర్ న్యాయని మహేష్ రెడ్డి అభినందించారు. వివరాలు.. తూర్పుగోదావరి రాజోలుకు చెందిన మూరి పద్మావతి 20 ఏళ్ల కిందట జీవోనపాధి కోసం కంపెనీ వీసాపై కువైట్‌కు వెళ్లారు. ఆమెకు వీసా తీసిన వ్యక్తి మోసం చేయడంతో అక్కడే ఇంట్లో పని చేసేవారు. అక్కడే ముంబాయికి చెందిన మహ్మద్ యూనుస్ అనే యువకుడు ఆమె కష్టాలు చూసి స్వయంగా టికెట్ కొని ఇండియాకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అతన్ని ఎన్ఆర్‌టిఎస్ సభ్యులు అభినందించారు.

కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టల పునర్విభజనలో భాగంగా జమ్మలమడుగు పరిధిలో ఉన్న కొన్ని మండలాలను విభజించి చాపాడుకు ఐసిడిఎస్ ప్రాజెక్టు మంజూరు చేశామన్నారు. ఈ ప్రాజెక్ట్ కింద చాపాడు, దువ్వూరు, బ్రహ్మంగారి మఠం మండలాలున్నాయన్నారు. నూతన ప్రాజెక్ట్ ఏర్పాటు వల్ల అంగన్వాడీల పర్యవేక్షణ సులభతరంగా ఉంటుందని పేర్కొన్నారు. అంగన్వాడీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. స్థలాలు అందుబాటులో ఉంటే రూ. 11 లక్షలతో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి టి లక్ష్మయ్య, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, ఐసిడిఎస్ సిడిపిఒ సావిత్రమ్మ, సర్పంచి మహబూబ్ బీ, హైమావతి, ముంతాజ్, రాజేశ్వరి, అరుణా, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, ఎంఇఒ రవిశంకర్, సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, శారద, సౌజన్య, వరలక్ష్మి, ధరణి, కళావతి , అంగన్వాడీ సిబ్బంది, వైసిపి నాయకులు శేఖర్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఓబుళరెడ్డి, నారాయణరెడ్డి, బాల నరసింహారెడ్డి, జయ రామిరెడ్డి, పివి రమణారెడ్డి, జయ సుబ్బారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, సర్పంచులు కిషోర్ కుమార్ రెడ్డి, రాజేష్ రెడ్డి, శ్రీనువాసుల రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేంపల్లె : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గిడ్డంగివారిపల్లె, టి. వెలమవారిపల్లె, ఇడుపులపాయ 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్న కారణంగా విద్యుత్ సబ్ స్టేషన్ నియంత్రణలో ఉన్న గ్రామాల్లో శ ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. కాబట్టి ఆయా గ్రామాల్లో ఉన్న రైతులు, ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు. అలాగే వేంపల్లెలోని 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌లోనూ మరమ్మతులు చేస్తున్నదున చింతలమడుగుపల్లె, టిచర్స్ కాలనీ, లయన్స్ నగర్, రాజీవ్ నగర్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, పులివెందుల రోడ్డు, సాయి నగర్, పిరమిడ్ నగర్, చైతన్య స్కూల్, కాపు వీధి, పాత పేట, అమ్మవారిశాల వీధి, వివేకానంద కాలనీ, ఎస్సీ కాలనీ, గాండ్ల వీధి ప్రాంతాల్లో ఉదయం 7.30 నుండి 10.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వేంపల్లె టౌన్ జెఇ చంద్రశేఖర్ తెలిపారు.

హామీలు మరిచిన సిఎం

బద్వేలు : తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మరిచారని ఎఐటియుసి బద్వేల్ పట్టణ కార్యదర్శి ఇర్ల నాగేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం బద్వేల్ పట్టణ సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో 40 వేలకు పైగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. వారిని పర్మినెంట్ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని లేని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పశువులకు వైఎస్‌ఆర్ పశు బీమా

ముద్దనూరు : ప్రమాదవశాత్తు మరణించే పశువులకు బీమా అందించి పశు పోషణపై ఆధారపడి జీవిస్తున్న చిన్న సన్నకారు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్‌ఆర్ పశు బీమా పథకం ప్రవేశపెట్టిందని పశు సంవర్ధక శాఖ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని నల్లబల్లెలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేల్పుచెర్ల పశు వైద్యాధికారి హిమబిందు రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్‌ఆర్ పశు బీమా పథకాన్ని చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు పోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు తమ పశువులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆర్థికంగా ఆదుకునేందుకు బీమా అందిస్తుందన్నారు. 2 –10 సంవత్సరాల వయసుగల ఆవులకు, 3– 12 సంవత్సరాల గేదెలకు, ఒకటిన్నర సంవత్సరం పైబడిన మేలు జాతి ఎద్దులు, దున్నలకు, రెండు సంవత్సరాలు పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు పథకం వర్తిస్తుందన్నారు. 6 నెలలు ఆపై వయసుగల గొర్రెలు, మేకలకు బీమా చేయవచ్చన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే నాటు పశువులకు రూ.15వేలు, మేలు జాతి పశువులకు రూ. 30వేలు, గొర్రెలు మేకలకు రూ. 6వేలు బీమా అందజేస్తారన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

డిఆర్‌ఎంకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజలు

అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు– జమ్మలమడుగు రహదారిలో ఉన్న రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ప్రజలతో కలిసి వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్ రెడ్డి శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో రైల్వే గుంతకల్లు డిఆర్‌ఎం కొటేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైల్వే రాకపోకలు ఎక్కువ కావడం వల్ల పలు సార్లు గేట్లు పదే పదే వేస్తుండడంతో ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గేట్ అవతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటం వల్ల పదే పదే గేట్లు మూత వేయడం వల్ల రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈవిషయంపై డిఆర్‌ఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బద్రి, వినయ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

పట్టణ పరిధిలో నిర్మిస్తున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వై.ఎస్ మనోహర్‌రెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జులై 8న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పర్యటన ఉన్నందున ఆలోపే వేగం పెంచి నిర్దేశిత గడువు లోపల పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్ కుమార్, మున్సిపల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని పులివెందుల ఒఎస్‌డి అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఒఎస్‌డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. నాడు –నేడు కింద పాఠశాలల రూపు రేఖలను మార్చివేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించిన ఘనత సిఎం జగన్ రెడ్డికే చెందుతుందని చెప్పారు. సిఎం ఆశయాలకు అనుగుణంగా ప్రతి విద్యార్థీ ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయిలో నిలవాలని కోరారు. రోజూ పాఠశాలకు తప్పకుండా వచ్చి ఉపాధ్యాయులు చెప్పిన విషయాలను నేర్చుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాల ఉందని విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యాను నేర్చుకొనే పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ఉచితంగానే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూ, బ్యాగ్‌తో పాటు ఇతర పుస్తకాలు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు అమ్మఒడి కూడ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లును అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, వార్డు సభ్యులు ముత్యాల ఆంజనేయులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లను అందజేస్తున్న ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

జిఒ 31ని వెంటనే ఉపసంహరించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రవాణా వాహనాల త్రైమాసిక పన్నును ఒకే సారి 25 శాతం పెంచుతూ తీసుకొచ్చిన జిఒ నెంబరు 31ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వడ్డింపులు, వాయింపుల ప్రభుత్వంగా తయారైందని అన్నారు. జగన్ పాలనలో ఇప్పటికే రవాణా రంగం కుదేలైందని చెప్పారు. రవాణా వాహనాలపై త్రైమాసిక పన్నులు పొరుగు రాష్ట్రాల కంటే 30 శాతం అధికంగా ఉందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ అన్ని రాష్ట్రాల కంటే ఎపిలోనే అధికం అన్నారు. అలాగే లీటర్ పెట్రోల్, డీజిల్ ధరలపై రూ 4 అదనపు వ్యాట్ అన్నారు. రూ 1 రోడ్డు సెస్సు రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్నట్లు చెప్పారు. అందువల్ల పెట్రోల్, డీజిల్ ధరలు అన్ని రాష్ట్రాల్లో కంటే ఏపిలోనే ఎక్కువ అన్నారు. వాహనాలపై గ్రీన్ ట్రాక్స్‌ను ఒకే సారి రూ 200 నుంచి రూ. 20వేలకు పెంచిందని చెప్పారు. గోరుచుట్టుపై రోకలి పోటు అన్న చందంగా రవాణా వాహనాల త్రైమాసిక పన్నును పెంచుతూ జారీ చేసిన 31 జీవో బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అన్నిటికి వర్తిస్తుందని చెప్పారు. ప్రజలపై అదనపు భారం ఎడాదికి రూ.250 కోట్లు పడుతుందని చెప్పారు. 6 చక్రాల లారీపై ఇది వరకే త్రైమాసిక పన్ను రూ.3940 కాగా, ఇప్పడు రూ.4970 చెల్లించాలని చెప్పారు. రాబోవు రోజుల్లో బస్సు ఛార్జీలు వివిధ సరుకుల ధరలు పెరుగుతాయని చెప్పారు. చాక్లెట్ ఇచ్చి నెక్లేస్ లాక్కోన్నట్లుంది వైసిపి పాలన తీరు అన్నారు. ప్రజా వ్యతిరేక జీవో 31ని ప్రభుత్వం రద్దు చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో రామకృష్ణ, ధృవకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, ఉత్తన్న, అమర్, రవి, శివ, బాలం సుబ్బరాయుడు, బద్రి, రాఘవయ్య పాల్గొన్నారు.

ప్రజల నడ్డి విరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

పోరుమామిళ్ల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసి రెడ్డి వ్యాఖ్యానించారు. పోరుమామిళ్ల పట్టణంలోని అన్వర్ ఆస్పత్రిలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై సవతి తల్లి ప్రేమను చూపిస్తూ, దొందు దొందు గానే వ్యవహరిస్తున్నాయని వాపోయారు. బిజెపి ప్రభుత్వం చమురు గ్యాస్ ధరలు పెంచుతూ పోతే, రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసరాలను, విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. వైసిపి, బిజెపి ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, అటు కేంద్రంలో ఇటు రాష్ట్రంలో కూడా రెండు పార్టీలు అధికారం కోల్పోవడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయనను డాక్టర్ అన్వర్ శాలువా, పూల మాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రతినిధి అన్వర్, కాంగ్రెస్ నాయకులు బుడిగి శ్రీను, కార్యకర్తలు ముజాహిద్, ఫైసల్, సోహెల్, ఫయాజ్, అల్తమాస్ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

ఎపి ఎస్ఎస్‌డిసి (న్యాక్) నిరుద్యోగ యువతకు నైపుణ్య ఉచిత శిక్షణ కోసం పులివెందుల నియోజకవర్గ యువతి, యువకులకు దరఖాస్తులు చేసుకోవచ్చని పురపాలక కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ , కౌశల్ వికాస్ యోజన ద్వారా పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యాలకు అనుగుణంగా ఆయా రంగాలలో శిక్షణ ఇచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రతి నియోజకవర్గంకు ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేసిందని తెలిపారు. అసిస్టెంట్ సర్వేయర్, అసోసియేట్ ఎలక్ట్రికల్ , అసిస్టెంట్ ఎయిర్ కండిషనర్, కుట్టు యంత్రం ఆపరేటర్, టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, జూనియర్ ఎక్సకావాటర్ ఆపరేటర్ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల యువతీ యువకుల దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు 18 నుండి 28 ఏళ్ల వయస్సు కల్గి, 8,10, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు. తమ ఆదార్ కార్డు రేషన్ కార్డు, పదవ తరగతి కి సంబంధించిన సర్టిఫికెట్లు, నాలుగు కలర్ పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో న్యాక్ సెంటర్‌లో ఈనెల 25లోగా సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం

ప్రజాశక్తి - లింగాల

ప్రకృతి వ్యవసాయం తోనే రైతుకు అధిక దిగుబడును, ఆదాయం వస్తుందని ప్రకృతి వ్యవసాయ స్టేట్ కన్సలెంట్ సురేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో లింగాలలో వైఎస్‌ఆర్ క్రాంతి పథం కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విషపూరిత రసాయన వ్యవసాయం నుండి ప్రకృతి వ్యవసాయం రంగం వైపు రావాలని తెలిపారు. రైతు ఆదాయం పెంచుకునేలా పలు పంటల విధానాన్ని అవలంభించి అదనపు ఆదాయం పొందాలన్నారు. ఇంటి పరిసరాలలో కిచెన్ గార్డెన్ వేసుకొని ఎలాంటి రసాయన ఎరువులు లేకుండా కూరగాయల పండించుకోవచ్చు అన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయాన్ని మండలంలో అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి, నరసింహారెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి కృష్ణయ్య, యామిని, నీలావతి పాల్గొన్నారు

పుస్తక ఆవిష్కరణ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - చాపాడు

మూడు తరాల ప్రజా సారథి పుస్తక ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయ జీవిత చరిత్రకు సంబంధించిన మూడు తరాల ప్రజాసారథి పుస్తకాన్ని రచయిత తవ్వా వెంకటయ్య రచించారన్నారు. ఈ పుస్తకం ఆవిష్కరణ సభ ఈ నెల 20న మంగళవారం మైదుకూరు కెసిఎస్ కల్యాణ మండపంలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి , టిటిడి చైర్మన్ వై వి సుబ్బారెడ్డి, జిల్లాలోని రాజకీయ ప్రముఖులు ఎమ్మెల్యేలు, రచయితలు కవులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు తన అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి గృహసారథుల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు బాల నరసింహారెడ్డి, ఓబుల్ రెడ్డి, పివి రమణారెడ్డి, వెంకట రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రామాంజనేయుల రెడ్డి, మహేష్, శ్రీనువాసుల రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపేష్‌రెడ్డి

అవినీతి పాలనను అంతమొందించాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

అవినీతి పాలను అంతమొందించాలని భూపేష్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిన్నదండ్లూరు గ్రామపంచాయతీ పరిధిలోని మేకల బాలయ్యపల్లె గ్రామంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం జమ్మలమడుగు నిర్వహించారు. గ్రామంలోని కాశిరెడ్డి నాయన ఆలయంలో పూజలు నిర్వహించి, గ్రామ నాయకులు, యువకులతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచక పాలనను అంతమొందించాలని, టిడిపి ప్రవేశపెట్టిన భవిష్యత్తు గ్యారెంటీ మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని క్లుప్తంగా ప్రజలకు వివరించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అధికారం అందించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని ప్రజలను కోరారు. అలాగే వల్లపు నాగేంద్ర,గోగుల వెంకటేష్, మురళీమోహన్ రెడ్డి, ఎంవి సుధాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు భూపేష్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వారిని భూపేష్ రెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల జయరామిరెడ్డి,రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి, శంభుడు, నరేష్, సుబ్బరాయుడు, గిడ్డయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతి

ముద్దనూరు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం సర్పంచ్ సరళ, ఎంపిటిసి జెడి ఇంద్రాణి విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన దీపికా భాయికి రూ. 3 వేలు, ండవ స్థానంలో నిలిచిన ఆస్మకు రూ. 2వేలు, మూడవ స్థానంలో నిలిచిన వనితకు రూ. వెయ్యి ప్రోత్సాహక బహుమతిగా అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు తెలిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సుధాకర్ ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవ రెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ఎర్రగుంట్ల : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జడ్‌పిటిసి తుమ్మిశెట్టి బాలయ్య పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 576 మార్కులతో మొదటి స్థానం సాధించిన షేక్ షాహీన్ కు రూ.3వేలు, పాఠశాల స్థాయిలో రెండవ స్థానంలో 543 మార్కులు సాధించిన మస్తాన్‌బీకి రూ.2 వేలు, మూడవ స్థానంలో 535 మార్కులు సాధించిన జాహ్నవికి రూ. వెయ్యి గదు పురస్కారాలను జడ్‌పిటిసి చేతుల మీదుగా అందించారు. ఆయన మాట్లాడుతూ 2023 –24 సం వత్సరంలోనూ పదవ తరగతి విద్యార్థులు కూడా కష్ట పడి చదివి మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చంద్రకళ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జరీనా, వైస్ చైర్మన్ మల్లికార్జున, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు తులసి లక్ష్మి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నం వడ్డిలస్తున్న కుటుంబ సభ్యులు

ఆశ్రమాల్లో అన్నదానం

పులివెందుల రూరల్ : పట్టణంలోని లీలావతి, శ్రీ వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమాల్లో శుక్రవారం కొంగనపల్లె లక్ష్మీనారాయణమ్మ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారులు, 23వ వార్డు కౌన్సిలర్ కొంగ నపల్లె కొండలరావు , కొంగనపల్లి మురళీమోహన్, కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి కృష్ణ, రమ్య , కృష్ణ చైతన్ ,రిషికేష్, రాజేశ్వరి దేవి సుభద్ర , ఆశ్రమ నిర్వాహకులు రామ్మోహన్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONOURABLE IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE (SPECIAL MOBILE COURT), KADAPA

O.S.No. 507/2022

Dandu Srinivasulu, Son of D.Narasimhulu, age 34 years, Hindu, Business, residing at Door No.15/322, Habibulla Street, Kadapa City, YSR Kadapa District. **...Plaintiff**

Vs

Amaravathi Ravi Kumar, Son of A.Somaiah, aged about 40 years, Hindu, Business, residing at Door No.11/729, Habibullah Street, Kadapa City, YSR Kadapa District. **...Defendant**

నోటీసు

పైన తెలిపిన వాది, మీ పై మహారాజశ్రీ కడప నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్ (స్పెషల్ మొబైల్ కోర్ట్), నందు పైన తెలిపిన దావాను దాఖలు చేసిఉన్నారు. అట్టి దావా నందు మీరు కోర్టు నుండి పంపిన నోటీసులు తీసుకోనందున, కోర్టు ఉత్తర్వు ప్రకారము పత్రికా ముఖమున మీకు నోటీసును పంపుచున్నాము. సదరు కేసు 21.06.2023 తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున మీకు ఏవైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట పై తేదిన ఉదయం గం.,10.30 నిమిషములకు ప్రత్యక్షముగా కానీ, లాయర్ గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును.

//By order of the Hon'ble Court//

D.REDDAIAH, S.BALAJI, N.GURUNATH

Advocates, Kadapa City.Cell:9966077779


మట్టినమూనా సేకరిస్తున్న వ్యవసాయాధికారి

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులు భూసార పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా ఎరువులు వాడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో శుక్రవారం ప్రయోగాత్మకంగా మట్టి నమూనాలు సేకరించడం, వాటి ఆవశ్యకతపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు సాగు చేసే పంటలకు సంబంధించి పొలంలో పోషకాలు అందుబాటులో ఉన్నాయా, ఏ పరిమాణంలో వాడుకోవాలో వివరించారు. సూక్ష్మ, స్థూల పోషకాలు, సేంద్రియ కర్బనం, ఉదజని సూచిక లవణ సాంద్రత, లవణ పరిమాణం భూమి సారవంతం, నిస్సారవంతం విషయాలను పరీక్షా కేంద్రంలో పరిశోధన చేస్తారన్నారు. అనంతరం ఫలితాలను రైతులకు అందజేస్తామని తెలిపారు. ఆ మేరకు సిఫారసు చేసిన పోషకాలను మాత్రమే సూచించిన పరిమాణంలో వాడుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు.రైతులు అధిక ఆదాయం పొందేలా తీర్చిదిద్దడమే మట్టి నమూనాల ప్రాధాన్యత అన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె ఇన్‌ఛార్జి బిటిఎం రవికుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీరుస్తాం

వేంపల్లె : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చర్యలు చేపట్టినట్లు పులివెందుల ఒఎస్‌డి అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కత్తులూరు, తాళ్ళపల్లె, టి. వెలమవారిపల్లె గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఒ వాటర్ ప్లాంట్లను జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రీ, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒఎస్‌డి మాట్లాడుతూ తాగునీటి కష్టాలు లేకుండా చేసేందుకు ప్రతి గ్రామంలోనూ ఆర్ఒ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ సురక్షిత మంచినీటిని తాగాలని కోరారు. ఆర్ఒ ప్లాంట్ల వల్ల నీటి ఇబ్బందులు తొలగి పోతాయని చెప్పారు. కార్యక్రమంలో కత్తులూరు మాజీ సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, ఉత్తయ్య, వైసిపి నాయకులు, మండల స్థాయి అధికారులు, అయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో 'బీరం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఖాజీపేట

విద్యార్థిని అభినందిస్తున్న బీరం శ్రీధర్‌రెడ్డి

మండల పరిధిలోని కొత్త నెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్–2023 ఫలితాల్లో , ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచారు. ఆలిండియా 247వ ర్యాంకుతో విద్యార్థి పి. చెంద్రాయుడు అనే విద్యార్థితో పాటు, పరీక్ష రాసిన ప్రతి ఇద్దరిలో ఒకరు మెడికల్ సీట్ సాధించి రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలోనూ కళాశాల పేరును నిలబెట్టారు. ఇటీవల విడుదలైన ఎపి ఇంజినీరింగ్ ఫలితాల్లోనూ పి. చెంద్రాయుడు 53వ ర్యాంకు, వి. ఓబుల్ రెడ్డి 103వ ర్యాంకు సాధించి కళాశాలను రాయలసీమలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కరస్పాండెంట్ బీరం సుబ్బారెడ్డి చైర్పర్సన్ సరస్వతమ్మ మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకులచే నాణ్యమైన శిక్షణ అందిస్తూ ఇంతటి అద్భుతమైన ఫలితాలను సాధించామని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కళాశాల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్ మాట్లాడుతూ కళాశాలలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ ఈనెల 19 నుంచి ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. నీట్–2023 ఫలితాల్లో సీట్ రాని విద్యార్థులకు ఇది ఒక గొప్ప సదవకాశమని, కళాశాలలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటే తప్పకుండా మెడికల్ సీట్ సాధిస్తారని వారు తెలియజేశారు. కార్యక్రమంలో బీరం శ్రీధర్ రెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు పులివెందుల మండల సమావేశం

పులివెందుల టౌన్ : స్థానిక ఎంపిడిఒ సబా భవనంలో శనివారం ఎంపిఇప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖలాధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి -జమ్మలమడుగు రూరల్

వెంకటసుబ్బయ్య

వెంకటేష్

ప్రభుత్వం జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందిళ్ల సుబ్బ రాజు యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బి భవనంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులకు నష్టాన్ని చేకూరుస్తుంద న్నారు. గ్యారెంటీ పెన్షన్ అని చెప్పి ఉద్యోగుల నుంచి తీసుకునే 10 శాతాన్ని యధావిధిగా కొనసాగిస్తామని చెప్పడంలో సిపిఎస్ రద్దు కనిపించడం లేదన్నారు. ఉద్యోగుల వాటా లేకుండా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగ ఉపాధ్యాయుడి సిపిఎస్ మొత్తాన్ని వెనక్కి తెప్పించి వారికి పిఎఫ్ ఖాతాలను ఓపెన్ చేసి వాటిలో జమ చేయాలని కోరారు. 11వ పిఆర్‌సి బకాయిలు, కరువు బత్యం బకాయలను వెంటనే విడుదల చేసి ఉద్యోగ ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జమ్మలమడుగు మండలం అధ్యక్షునిగా కెపి వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా కె. వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎంపిడిఒకు వీడ్కోలు

ఎర్రగుంట్ల : మండలంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగోన్నతిపై ఎంపిడిఒగా ముద్దనూరు మండలానికి బదిలీ అయిన సూర్య నారాయణరెడ్డికి కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. కార్యక్రమానికి తహశీల్దార్ హాజరై సమావేశంలో మాట్లాడుతూ నాలుగేళ్లుగా తాము అన్నదమ్ముల్లాగా కలిసిమెలిసి పనిచేశామని, మండల అభివృద్ధి కోసం సూచనలు, సలహాలు పంచుకునే వారమని తెలిపారు. ఎప్పుడు చిరునవ్వుతో పలకరించే వ్యక్తి బదిలీపై వెళ్లడం కొంతమేర బాధ కలిగించినా ప్రభుత్వ ఉద్యోగులుగా ఇది తప్పదని అన్నారు. జడ్‌పిటిసి బాలయ్య మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం ఎంతో పాటు పడ్డాడని, నిస్వార్థంగా సేవ చేసే వ్యక్తి బదిలీ కారణంగా దూరంగా వెళ్లడం ఎంతో బాధాకరమని తెలిపారు. సహ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు ఎంపిడిఒగా మండలానికి చేసిన అభివృద్ధి, ఆయన వ్యక్తిత్వం గురించి కొని యాడారు. సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యాలయ, సచివాలయ సిబ్బంది, సూర్య నారాయణరెడ్డిని శాలువ, పూలమాలతో సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు.

ఎంపిడిఒకు ఘనంగా సన్మానిస్తున్న సిబ్బంది, ఉద్యోగులు